

సోమశిలలో 30.360 టీఎంసీలు

సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 30.360 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 133 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,290
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,624
3శాతం జీఎస్టీతో	రూ.5,792
నవర (8గ్రా)	రూ.46,336

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.5 /24.4

మంగళవారం గాలిలో తేమ 47 శాతం ఉంది. బుధవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలలో మార్పులు ఏమీ ఉండకపోవచ్చని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన జస్టిస్ శేషసాయి కుటుంబసభ్యులు

నెల్లూరు(బృందావనం): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ ఏవీ శేషసాయి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తి శేషసాయిని వేదపండితులు,అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, ప్రొటోకాల్ న్యాయమూర్తి వినోద్ పాల్గొన్నారు. తొలుత దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు.

చెడుపై మంచి విజయానికి నాంది విజయదశమి పండగ



కుటుంబంతో కలిసి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం, పోలీసు కార్యాలయంలో మంగళవారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌బీ, జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎంటీఓ విభాగం, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో వాహన పూజ, ఆయుధ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెడుపై మంచి విజయానికి నాంది విజయదశమి పండుగ అన్నారు. జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

జలాశయాన్ని సందర్శించిన సమాచార కమిషనర్



సిబ్బందితో మాట్లాడుతున్న సమాచారశాఖ కమిషనర్ చిన్నారెడ్డి

సోమశిల: సోమశిల జలాశయాన్ని మంగళవారం రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ చిన్నారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా జలాశయ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జలాశయంలో 30 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మస్తాన్‌బాషా, గ్రామ రెవెన్యూ అధికారి ఉదయగిరి ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాల చీరలో ముత్యాలమ్మ



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

చిల్లకూరు: తూర్పుకనుమూరులోని ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ మేరకు అమ్మవారు ముత్యాల చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో చండీ యాగం జరిపించారు. సాయంత్రం మహా త్రిపురసుందరీదేవి అలంకరణలోని ముత్యాలమ్మ ఉత్సవమూర్తిని మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమానికి రామారెడ్డిపాళానికి చెందిన సన్నారెడ్డి వెంకట రమణారెడ్డి కుటుంబీకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

కిడ్నాపర్ల నుంచి రక్షణ



అనంతపురం జిల్లాకు చెందిన కిడ్నాప్ కేసును జిల్లా యంత్రాంగం గంటల వ్యవధిలో ఛేదించింది. విద్యార్థిని కిడ్నాప్ అయిన విషయాన్ని ఆమె తండ్రి 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశాడు. అనంతపురం జిల్లాలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును నెల్లూరు జిల్లా ముత్తుకూరు పోలీసులకు అప్పగించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఫోన్ ఆధారంగా ఆమె ఎక్కడున్నదీ తెలుసుకుని, కిడ్నాపర్ల నుంచి రక్షించి తండ్రికి అప్పగించారు.

మంచినీటి సమస్య పరిష్కారం



మా గ్రామంలో మంచినీటి సరఫరా సిస్టమ్ మరమ్మతులకు గురయింది. ఇదే విషయాన్ని జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశాను. వెంటనే స్పందించిన అధికారులు రూ.50 వేల పంచాయతీ నిధులను విడుదల చేశారు. మంచినీరు విడుదల అయ్యేలా చర్యలు తీసుకున్నారు. 300 కుటుంబాలకు మంచి నీరు సరఫరా అవుతోంది. – **జయరామయ్య, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం**

నిమిషాల వ్యవధిలో..



కావలి తుమ్మలపెంటకు చెందిన శర్వానాదంకు చెందిన స్థలం రికార్డుల్లో ప్రభుత్వ స్థలంగా నమోదు అయింది. కావలిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ నిమిషాల వ్యవధిలో సమస్యను పరిష్కారించారు.

గంటల వ్యవధిలోనే పరిష్కారాలు

- జగనన్నకు చెబుదాంకు భారీగా ప్రజా స్పందన
- ప్రజల వద్దకే జిల్లా అధికారులు
- ఇప్పటికే 12,336 వినతులు
- వాటిలో 10,012 సమస్యల పరిష్కారం
- రీ ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి
- జెడ్పీ సీఈఓ ఆధ్వర్యంలో మానిటరింగ్ సెల్



జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ కూర్మనాథ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారాలు లభిస్తున్నాయి. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, మునిసిపాలిటీ, హౌసింగ్, సివిల్ సప్లై, ఆర్‌అండ్‌బీ, పీఆర్, విద్య, వైద్యం తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయి. గ్రామాల్లో మంచినీరు, వీధిలైట్లు, పారిశుధ్యం తదితర సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరిస్తున్నారు. నూతన జిల్లా ప్రకారం 38 మండలాలు ఉన్నాయి. సుమారు 28 లక్షల మంది జనాభా జీవనం సాగిస్తున్నారు. సుమారు 1237 అవాస గ్రామాలు ఉన్నాయి. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం 09-05-2023న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి 1902కు ప్రజలు ఫిర్యాదు చేసేలా ఫోన్ నంబర్ కేటాయించారు. ఇప్పటి వరకు 12,336 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 10,012 సమస్యలను అధికారులు పరిష్కరించారు. వచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పరిశీలన చేస్తున్నారు. దానికి సంబంధించి అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్‌లో సీఈఓ ఆధ్వర్యంలో మానిటరింగ్ చేస్తున్నారు. సీఈఓ చిరంజీవిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వారం వారం అధికారులు మానిటరింగ్ చేస్తున్నారు. పోలీసు కేసులు సైతం పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.

ఎప్పటికప్పుడు మార్పులు

ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తోంది. ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకు వచ్చేలా సంస్కరణలు చేపడుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ పేరుతో వివిధ సమస్యలపై అర్జీలు తీసుకునే వారు. కానీ పరిష్కారం మాత్రం నామమాత్రంగానే ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీవెన్స్ సెల్‌ను స్పందన పేరుతో సరికొత్త సంస్కరణలతో చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్, ఆర్‌డీఓ, ఎంపీడీఓ, గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభించారు. ఫలితంగా ఏ గ్రామంలో నివసించే వారు అదే గ్రామ సచివాలయంలో తమ సమస్యను అధికారులకు విన్నవించే వెసులుబాటు కలిగించారు. అక్కడ తీరని సమస్య అయితే కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి వచ్చేవారు. అనంతరం జగనన్నకు చెబుదాం పేరుతో నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేసే ప్రక్రియకు ప్రభుత్వం నాంది పలికింది. తద్వారా ఫిర్యాదు నేరుగా సీఎం కార్యాలయానికి చేరేలా ఆధునీకరించారు. నేరుగా సీఎం కార్యాలయం దృష్టిలో సమస్య ఉండడంతో దీనిని తప్పనిసరిగా పారదర్శకంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై పడింది. ఫలితంగా ప్రజలకు మరింత మేలు చేకూరింది. ఇదే క్రమంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని ద్వారా సొంత మండలంలోనే అక్కడి ప్రజలు తమ సమస్యలు చెప్పుకుని, పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తోంది.

రీ ఓపెన్‌పై ప్రత్యేక దృష్టి

జగనన్నకు చెబుదాంలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తున్నారు. అధికారులు నేరుగా ప్రజలకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారం పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనే విషయాలు తెలుసుకుంటున్నారు. కానీ అనేక ఫిర్యాదులు మరల మరల వస్తున్నాయి. రీ ఓపెన్‌పై రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా కలెక్టర్ హరినారాయణన్ ప్రత్యేక దృష్టి సారించారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు.

సంగం గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదంటూ మసీద్ వీధికి చెందిన ప్రజలు 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశారు. అధికారులు సమస్యను ఒక్క రోజులోనే పరిష్కరించారు.

ఆక్రమణల తొలగింపు

కావలి పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రజలు జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా పరిశీలించి ఆక్రమణలను తొలగించారు.

త్వరగా పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు, హౌసింగ్, పీఆర్, మునిసిపాలిటీ తదితర శాఖలకు సంబంధించి అధికంగా సమస్యలు వస్తున్నాయి. ఆయా శాఖల అధికారులతో క్రమం తప్పకుండా చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– **చిరంజీవి, జెడ్పీ సీఈఓ**

పెంచలకోనలో వైభవంగా ముగిసిన ఉత్సవాలు



పెంచలకోనలో అశ్వవాహనంపై శ్రీపెనుశిల లక్ష్మీనరసింహుడు

- అశ్వవాహనంపై పారువేటకు వెళ్లిన శ్రీలక్ష్మీనరసింహుడు
- స్వామివారిని అశ్వవాహనంపై ఉంచి గ్రామోత్సవం



పెంచలకోనలో అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీపెనుశిల లక్ష్మీనరసింహుడు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవికి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలు విజయదశమితో ముగిశాయి. మంగళవారం ఉదయం 9 గంటలకు స్వామి వారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం విగ్రహాన్ని అశ్వవాహనంపై కొలువు తీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలు అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆర్టీసీ బస్టాండు వరకు పారువేటకు స్వామివారు తరలివెళ్లారు. అక్కడ ఉంచిన జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మికులను భక్తులు పంచారు. అనంతరం స్వామిఅమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. విజయదశమిని పురస్కరించుకుని మండలంలోని గోనుపల్లిలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని అశ్వవాహనంపై కొలువు తీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

హిందూ ధర్మప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు రాపూరులోని జూనియర్ కళాశాల ఆవరణలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్ల రథయాత్ర జరుగుతుందన్నారు. రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. అలాగే పురాణ ప్రవచనాలు, అన్నమాచార్య కీర్తనల ఆలాపన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కబడ్డీ పోటీల్లో సెమీస్‌కు జిల్లా జట్టు

- నూజివీడులో రసవత్తరంగా పోటీలు
- లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహణ
- నేడు ఫైనల్స్ మ్యాచ్‌లు



పోటీలో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న 71వ మహిళల, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సోమవారం సాయంత్రం ఏడు గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు, క్రీడల వల్ల పోటీతత్వం అలవడుతుందని, పేరుప్రతిష్టలు లభిస్తాయన్నారు. క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు.

సెమీస్‌కు చేరిన పురుషుల జట్లు

పురుషుల విభాగంలో కృష్ణా, శ్రీకాకుళం, నెల్లూరు, విజయనగరం జట్లు సెమీస్‌కు చేరాయి. లీగ్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో నెల్లూరు జట్టు శ్రీకాకుళంపై 33–31, కృష్ణా జట్టు విజయనగరంపై 30–22, నెల్లూరు జట్టు పశ్చిమగోదావరిపై 24–17, కృష్ణా జట్టు గుంటూరుపై 37–22, శ్రీకాకుళం జట్టు పశ్చిమ గోదావరిపై 41–13, విజయనగరం జట్టు గుంటూరుపై 29–14 తేడాతో గెలుపొందాయి.

మహిళల విభాగంలో..

శ్రీకాకుళం జట్టు విశాఖపట్నంపై 36–25, కృష్ణా జట్టు విజయనగరంపై 47–43 తేడాతో గెలుపొందాయి. మహిళల లీగ్ పోటీలు పొద్దుపోయే వరకు కొనసాగాయి. రిఫరీస్ బోర్డు కన్వీనర్ కే బాలు, రిఫరీలుగా ఎస్.మంగరాజు, ఎం.గణపతిరావు, బి.రామకృష్ణ, ఆర్.అప్పల స్వామి, కె.గోపిరాజు, బి.నాగేశ్వరరావు, పి.నరేంద్ర, వి.అనిల్, కె.జగదీష్ వ్యవహరించారు. ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం జరగనున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు రామిశెట్టి మురళీకృష్ణ, సెక్రటరీ తిరుమలశెట్టి వెంకట కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, సబ్బినేని శ్రీనివాస్, దాసరి సూర్య నారాయణ పాల్గొన్నారు.

అధికారి అత్యుత్సాహంపై భక్తుల మండిపాటు

- రద్దీ సమయంలో మాజీ మంత్రి నారాయణకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించిన ఈఓ

నెల్లూరు(బృందావనం): మాజీ మంత్రి టీడీపీ నాయకుడు పొంగూరు నారాయణతోపాటు కొందరు టీడీపీ నాయకులకు అమ్మవారి దర్శనం విషయంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి చూపిన అత్యుత్సాహంపై భక్తుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న నారాయణకు ప్రొటోకాల్‌ను విస్మరించి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి, అమ్మవారి దర్శనం కోసం వేచిఉన్న వేలాదిమంది భక్తులను కొంత సమయం పాటు నిలిపివేయడం ఏమిటని భక్తులు మండిపడుతున్నారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని సోమవారం సాయంత్రం మాజీ మంత్రి పొంగూరు నారాయణ దర్శించుకున్నారు. ఆయన దర్శనానికి వచ్చే సమయంలో భక్తులు క్యూలైన్లలో వందలాదిగా వేచి ఉన్నారు. ఆయన వచ్చిన వెంటనే దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సంప్రదాయంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు. ఈ సమయంలో కొంతసేపు భక్తుల క్యూలైన్‌లను నిలుపుదల చేశారు. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అనధికార దర్శనాలు, వీఐపీ దర్శనాలు లేవంటూ దేవస్థానం ముందుగానే ప్రకటించింది. కానీ మాజీ మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రాజానాయుడు, నాయకులు చెక్క సాయిసునీల్, ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గజరా నరేష్ తదితరులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకడం, అమ్మవారి దర్శనం కల్పించడంపై భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వ్యక్తిని రక్షించిన మెరైన్ సిబ్బంది

విడవలూరు: మండలంలోని రామతీర్థం వద్ద సముద్రంలో మునిగిపోతున్న వ్యక్తిని మెరైన్ సిబ్బంది రక్షించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అలగానిపాడు గ్రామానికి చెందిన బర్రి చెంచయ్య(37) స్నేహితులతో కలిసి సముద్రంలో మునుగుతున్నాడు. అలల తాకిడికి చెంచయ్య మునిగిపోతుండగా స్నేహితులు రక్షించేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో అక్కడే విధి నిర్వహణలో ఉన్న మెరైన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన అల్లూరు స్టేషన్‌కి చెందిన కానిస్టేబుల్ కొండలు, హోంగార్డు ఏడుకొండలు చెంచయ్యను కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. తనను రక్షించిన మెరైన్ సిబ్బందికి చెంచయ్య కృతజ్ఞతలు తెలిపాడు.

ఉరేసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్య

వెంకటాచలం: ఉరేసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పుంజులూరుపాడు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కర్ణాటకకు చెందిన లారీ డ్రైవర్ ప్రశాంత్(33) కృష్ణపట్నం పోర్టుకు సోమవారం లారీతో వచ్చాడు. తిరిగి బుధవారం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లాల్సి ఉండగా, ఈ లోపే లారీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనను గుర్తించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూరిళ్లు దగ్ధం

• ఆస్తి నష్టం

పొదలకూరు: పట్టణంలోని వినాయకమాన్యంలో మంగళవారం గిరిజన కుటుంబానికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. వీఆర్వో శ్రీహరి కథనం మేరకు వివరాలు.. వినాయకమాన్యంకు చెందిన పంతగిరి రమణమ్మ – రవి దంపతులు పోలేరమ్మకు పూజలు నిర్వహించేందుకు వెళ్లగా ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. సుమారు రూ.లక్ష విలువ చేసే గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. తహసీల్దార్ వీరవసంతరావు ఆదేశాల మేరకు వీఆర్వో శ్రీహరి బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు.

గ్యాస్ స్టౌ మంటలు అంటుకుని..

జలదంకి: మండలంలోని తిమ్మసముద్రం అంబేడ్కర్ ఎస్టీకాలనీలో ప్రమాదవశాత్తు గ్యాస్ స్టౌ అంటుకుని మంటలు చెలరేగడంతో పూరిల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు తిమ్మసముద్రం ఎస్టీకాలనీకి చెందిన తలపల దుర్గాప్రసాద్ – స్వాతిలకు పూరిల్లుతోపాటు పక్కనే చిన్నపాటి రేకుల షెడ్ కూడా ఉంది. మంగళవారం మధ్యాహ్నం స్వాతి గ్యాస్‌స్టౌ వెలిగించి తన పిల్లలతో ఇంటి పక్కనే ఉన్న అంగడికి వెళ్లింది. ఆ సమయంలో గ్యాస్ స్టౌ మంటలు పూరింటికి అంటుకుని పక్కనే ఉన్న రేకుల షెడ్‌కు కూడా వ్యాపించాయి. ఇంటి బయట ఉన్న బైక్ కూడా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.50 వేల నగదుతోపాటు ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. సర్పంచ్ రావి ప్రసాద్ నాయుడు తక్షణసాయంగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు నగదు అందజేశారు.



స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు



నగరోత్సవంలో భాగంగా శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ

వేడుకగా విజయదశమి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు, స్వామివార్లకి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు వారి ఇష్టదైవాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల పాలకమండలి చైర్మన్లు, సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నెల్లూరులోని అద్దాల సాయిబాబా మందిరంలో స్వామికి దీపాలంకరణ, ప్రత్యేక హారతులు

అక్రమ మైనింగ్ చేసేది టీడీపీ నేతలు కాదా?

• నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ చేస్తున్నది టీడీపీ నేతలు కాదా? అని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ ప్రశ్నించారు. నగరంలోని 40వ డివిజన్ కోనేటిమిట్ట, కొండదిబ్బ మున్సిపల్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మైనింగ్‌పై గత నాలుగు రోజులుగా పలు పత్రికల్లో రాష్ట్ర ప్రభుత్వంపై వస్తున్న కథనాలను ఖండిస్తున్నామన్నారు. సైదాపురంలో అక్రమ మైనింగ్ చేస్తున్నది టీడీపీ నాయకులేనని, ఈ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని తెలిపారు. గత ఆరు నెలలుగా ఈ అక్రమాలు అధికమయ్యాయని, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంచితనాన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది టీడీపీ నాయకులతో కలిసి అక్రమ మైనింగ్ చేస్తున్నారన్నారు. అక్రమ మైనింగ్ చేసేందుకు టీడీపీ నాయకులకు కొందరు అధికారులు సహకరిస్తున్నారన్నారు. అత్యధికంగా జోగులపల్లిలో అక్రమ మైనింగ్ జరుగుతుందన్నారు. టీడీపీకి చెందిన నాగేశ్వరరావు మైన్స్‌లో 10 ఏళ్ల క్రితమే లైసెన్స్ పూర్తయినా ఇంకా మెటీరియల్ తరలిస్తున్నారన్నారు. దీన్ని అడ్డుకున్నది వైఎస్సార్‌సీపీ నాయకులేనని తెలిపారు. రైతుల పొలాల్లో వారికి అక్రమ మైనింగ్‌కు అవకాశం ఇవ్వకపోతే వారిని కొందరు అధికారులు భయభ్రాంతులకు గురిచేసి, అక్రమ కేసులు పెడతామంటూ బెదిరించడం మంచిపద్ధతి కాదన్నారు. ఈ అంశానికి సంబంధించి వాస్తవాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, చాట్ల నరసింహారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మానికల సునీల్, నూనె ప్రసాద్, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్ వీడియోలు చూసి వృద్ధురాలి హత్య

• నగల కోసం ఘాతుకానికి పాల్పడిన విద్యార్థి
• కావలిలో ఘటన.. కేసును ఛేదించిన పోలీసులు

కావలి: నిత్యం యూ ట్యూబ్‌లో నేరాలకు సంబంధించిన వీడియోలు చూసి ఉన్మాదిగా మారిన ఓ విద్యార్థి.. ఒక వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఘటన కావలిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కావలి పట్టణంలోని జనతాపేట నార్త్‌లోని ప్రధాన వీధిలో ఒక రిటైర్డ్ లెక్చరర్ కుటుంబం నివాసం ఉంటోంది. దంపతులతో పాటు యజమాని అత్త మంచాల రమణమ్మ (85) కూడా వారితో ఉంటోంది. కావలి సమీప గ్రామానికి చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థితో రిటైర్డ్ లెక్చరర్‌కు పరిచయం ఉంది. ఆ విద్యార్థి వారి ఇంటి పనులు చక్కబెడుతుంటాడు. ఆదివారం రిటైర్డ్ లెక్చరర్ దంపతులు యథాప్రకారం ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి వృద్ధురాలు రక్తపుమడుగులో ఉంది. వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న కావలి టూ టౌన్ సీఐ సుధాకర్ విచారణ చేపట్టారు. నిందితుడి ఆనవాళ్లు దొరకడంతో తమదైన శైలిలో విచారించగా అన్ని వివరాలు చెప్పేశాడు. రిటైర్డ్ లెక్చరర్ దంపతులు ఒకరి తర్వాత ఒకరు వాకింగ్‌కు వెళ్లడం గమనించాడు. తన వెంట తెచ్చుకున్న సుత్తితో వృద్ధురాలి తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయింది. ఆమె వంటిపై ఉన్న ఐదున్నర సవర్ల బంగారం తీసుకొని, నేరుగా తన ఇంటికి చేరుకొని దాచిపెట్టాడు. ఆ బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులో ఆ విద్యార్థికి యూట్యూబ్‌లో నేరాల వీడియోలు చూసే అలవాటు ఉందని, దాని నుంచి ప్రేరణ పొంది హత్యకు పాల్పడ్డాడని తెలుసుకుని పోలీసులు నివ్వెరపోయారు.

యామిని న్యూరో కేర్ ఆస్పత్రి ప్రారంభం

నెల్లూరు(బృందావనం): నగరంలో పొగతోటలోని వెంకటరమణ హోటల్ వద్ద హర్ష స్కిన్ కాస్మొటాలజీ, లేజర్ సెంటర్ యామిని న్యూరో కేర్ హాస్పిటల్‌ను నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ డెర్మటాలజిస్ట్, కాస్మొటాలజిస్ట్ డాక్టర్ కె.ఆర్.హర్షవర్ధన్, న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎ.యామిని అత్యాధునిక సదుపాయాలతో మెట్రోపాలిటన్ నగరాలకు దీటుగా హర్ష స్కిన్, కాస్మొటాలజీ, న్యూరో కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ యామిని మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం పొగతోటలో ఆస్పత్రిని ప్రారంభించిన తాము ఆధునిక వైద్యసేవలందించాలన్న లక్ష్యంతో హాస్పిటల్‌ను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.వేదవతి సుబ్బారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డాక్టర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



యామిని న్యూరో కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.60
సన్నవి : రూ.25
పండ్లు : రూ.7

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.121
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.214
స్కిన్‌లెస్ చికెన్:	రూ.234
లేయర్ చికెన్:	రూ.187

జీకే స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): నగరంలోని విజయమహల్ సెంటర్ శ్రీనివాస అగ్రహారంలో జీకే స్పెషాలిటీ హాస్పిటల్‌ను నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలన్న లక్ష్యంతో ప్రముఖ కీళ్లు, ఎముకలు, నరాల స్పెషలిస్టు డాక్టర్ టి.గోపాలకృష్ణయ్య, ప్రముఖ కంటి వైద్యనిపుణురాలు డాక్టర్ కె.స్వప్న జీకే స్పెషాలిటీ హాస్పిటల్‌ను అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. డాక్టర్ గోపాలకృష్ణయ్య, డాక్టర్ కె.స్వప్న మాట్లాడుతూ మెట్రోపాలిటన్ నగరాలకు దీటుగా నెల్లూరులో అత్యంత ఆధునిక వైద్యపరికరాలతో, 50 బెడ్ల సామర్థ్యంతో ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ, జనరల్ సర్జరీ, యాక్సిడెంట్ అండ్ ఎక్సలెన్సీ కేర్, పల్మనాలజీలో ఉత్తమ సేవలందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.వేదవతి సుబ్బారెడ్డి, డాక్టర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డాక్టర్ వి.సూర్యప్రకాష్‌రావు, ప్రొఫెసర్లు చంద్రశేఖర్, రాజు అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.



అంకమ్మతల్లి సేవలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



రాపూరు: మండలంలోని వేపినాపి వద్ద వెలసిన అంకమ్మతల్లిని మంగళవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దేవస్థానం నిర్వాహకులు స్వాగతం పలికారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పి.మధుసూదన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, మండల కన్వీనర్ పి.దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, లీలామోహన్‌రెడ్డి ఉన్నారు.

యువతి కిడ్నాప్‌పై కేసు నమోదు

వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన యువతి కిడ్నాప్‌పై వెంకటాచలం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన మోషే దయాళం కుమార్తె సంపూర్ణ ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నెల 18వ తేదీన గ్రామానికి చెందిన కన్నన్ పూవర్షన్, ప్రేమ్‌కుమార్‌లు దయాళం ఇంటి వద్దకు కారులో వచ్చి సంపూర్ణను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఈ విషయంపై సంపూర్ణ తండ్రి దయాళం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా టైటిల్ ఆవిష్కరణ



కందుకూరు: శ్రీకళాధర ప్రొడక్షన్స్ 46 సినిమా బ్యానర్‌లో నూతనంగా నిర్మిస్తున్న 'రామాంతపురం ప్రెసిడెంట్ అల్లుడు' అనే సినిమా టైటిల్‌ని కందుకూరులోని ప్రొడక్షన్స్ కార్యాలయంలో మంగళవారం మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజీ అధినేత మలినేని లక్ష్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాధర ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న సినిమా టైటిల్ బాగుందని, చిన్న సినిమాలతో విజయాలు సాధిస్తున్న కందుకూరు ప్రాంతానికి చెందిన యూనిట్‌కు అభినందనలు తెలిపారు. తాను కూడా ఈ సినిమాలో నటిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. చిత్ర నిర్మాత తోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా తమ చిత్ర టైటిల్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. జస్టిస్ సినిమా దర్శకుడు సల్మాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారని, కో డైరెక్టర్‌గా రాజు, మ్యూజిక్ డైరెక్టర్‌గా సల్మాన్‌ఖాన్ పనిచేస్తున్నారని తెలిపారు. దర్శకుడు సల్మాన్ మాట్లాడుతూ తాము తీయబోతున్న ఈ సినిమాలో నటించేందుకు నూతన నటీనటులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 9908117056 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీఎం చౌదరి, శిరోమణి, ఇస్మాక్, రవికుమార్, పల్లాటి చెన్నయ్య, మౌనేష్, సాజిద్, సిద్దయ్య, వంశీ, బాజి, రమణిదాస్, మధురమణి పాల్గొన్నారు.

కీలెరించి.. మేలెంచు

బీపీ, షుగర్, క్యాన్సర్ జబ్బుల కన్నా ఆర్థరైటిస్ సమస్యే ఎక్కువ మందిలో ఉంది. కానీ దీనిపై అవగాహన అంతంతమాత్రంగా ఉండడంతో రోగులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా ఒక దశలో శరీర వైకల్యం వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సమస్యను ఎంత త్వరగా గుర్తిస్తే అంత తేలిగ్గా చికిత్స చేసి అదుపులో ఉంచుకోవచ్చని సూచిస్తున్నారు.

• రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థరైటిస్ రోగులు
• 35 ఏళ్లకే కీళ్ల నొప్పులు, అరిగిపోతున్న కార్టిలేజ్
• జీవనశైలి మార్పులతో అధికమవుతున్న సమస్య



జీజీహెచ్‌లో రోగి ఎముకల సమస్యను పరీక్షిస్తున్న వైద్యురాలు (ఫైల్)

నెల్లూరు సిటీ: జిల్లాల్లో ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పుల) బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో 50 నుంచి 60 ఏళ్ల వయస్సులో కనిపించే ఈ సమస్య ప్రస్తుతం 35 నుంచి 40 ఏళ్ల వారిలో కనిపిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 12 నుంచి 15 శాతం మంది వివిధ రకాల కీళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లలో జిల్లాలో వైద్యుల వద్దకు రోజుకు 500 నుంచి 600 మంది రోగులు ఈ సమస్యతో వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. జీజీహెచ్‌లోనే 150 నుంచి 200 మంది కీళ్లు, ఇతర సమస్యలతో వస్తున్నట్లు సమాచారం. దీనిని ప్రారంభంలోనే నియంత్రించకపోతే భవిష్యత్‌లో నడవలేని, కదల్లేని పరిస్థితులు రావచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఆర్థరైటిస్ అంటే..

ఆర్థరైటిస్ అంటే ఎముకలు, కీళ్లు, వాటి కణజాలాలకు సంబంధించిన సమస్య. సాధారణంగా కీళ్ల దగ్గర నొప్పి, వాపు వచ్చి అవి గట్టిగా మారడాన్ని, ఆయా కీళ్లలో కదలికలు తగ్గడాన్ని ఆర్థరైటిస్‌గా చెప్పవచ్చు. ఈ సమస్యల తీవ్రత సాధారణంగా ఉదయం పూట ఎక్కువగా ఉంటుంది. దాదాపు 30 నిముషాలపాటు ఈ నొప్పి, బిగుతుదనం ఉంటుంది.

రకాలు

ఆర్థరైటిస్‌లో ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, యాంకియోజింగ్ స్పాండైటీస్, గౌట్, జువైనల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్ (పిల్లల్లో వచ్చే కీళ్ల సమస్యలు), లూవస్, సోరియాటిక్ ఆర్థరైటిస్ వంటి సమస్యలతో రోగులు ఆస్పత్రులకు వస్తున్నారు.

లక్షణాలు

ఆర్థరైటిస్ లక్షణాలు అందరిలోనూ ఒకేలా ఉండవు. ముఖ్యంగా తొలి దశలో ఆకలి తగ్గడం, జ్వరం, బాగా నీరసించి పోవడం, బరువు తగ్గడం వంటివి కనిపిస్తాయి. ప్రధానంగా కీళ్లలో నొప్పి, వాపు, ఎర్రగా అవడం, కదలిక తగ్గడం, ఇతర అవయవాలపై ప్రభావం చూపడం జరుగుతుంది. ఇతర అవయవాలు అంటే చర్మంపై దద్దుర్లు, జుట్టు రాలిపోవడం, నోటిపూత, కిడ్నీ సమస్యలు, ఊపిరితిత్తుల సమస్య, పక్షవాతం, కంటిచూపు తగ్గడం, కళ్లు పొడిబారడం, కండరాల నొప్పి మొదలైన లక్షణాలు ఉంటాయి.

జీవనశైలిలో మార్పులే ప్రధాన కారణం

ఆర్థరైటిస్‌కు ప్రధాన కారణం జీవనశైలిలో మార్పులే. వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్ తినడం, ఫలితంగా ఊబకాయం, పోటీ ప్రపంచంలో పెరుగుతున్న ఒత్తిడి వంటి కారణాలతో ఆర్థరైటిస్ రావడాన్ని గమనించవచ్చు. వ్యాయామం చేయకపోవడం వల్ల మృదులాస్థి పునరుత్పత్తి పూర్తిస్థాయిలో ఏర్పడదు. సరైన ఆహారం, సరైన కదలిక లేకపోవడం వల్ల కూడా ఆర్థరైటిస్ వస్తుంది.

తీవ్రత తగ్గించుకోవాలంటే..

ఆర్థరైటిస్‌ను నయం చేయలేం కానీ మంచి ఆహారం, వ్యాయామం, మందుల ద్వారా తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఇందుకోసం క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, కంటి నిండా నిద్రపోవడం, అన్నిరకాల పోషకాలతో కూడిన సమతులాహారం తీసుకోవడం, ఒత్తిడి లేకుండా ఉండడం వంటి జాగ్రత్తలు అవసరం ఉంది. పొగ తాగడం, మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

వ్యాయామం తప్పనిసరి



ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారు ప్రతి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. తగిన ఆహారం, నిద్ర ఉండాలి. ముఖ్యంగా తారురోడ్డు, సిమెంట్ రోడ్డుపై వాకింగ్ చేయకూడదు. ప్రభుత్వ ఆస్పత్రిలో మోకాళ్ల కీళ్ల సర్జరీలు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

ఫిజియోథెరిపితో ప్రయోజనం



తొలి దశలో గుర్తించి మందులు వాడితే దుష్ఫలితాలు లేకుండా చూడవచ్చు. ఆర్థరైటిస్ 12 రకాలు ఉన్నాయి. వాటిలో రోగికి ఏ రకమైన ఆర్థరైటిస్ సోకిందో తెలుసుకోవాలి. వాటికి తగిన మందులు వాడాలి.

– వివేకానందరెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్